# మళ్ళీ అమరావతి కథలు

సత్యం శంకరమంచి




సోమలింగం సూటిగ్గా చూస్తే పచ్చని చెట్టు మాడిపోతుంది. నడిచిన నేలన పచ్చిక కూడా మొలవదు. అంతటి పుణ్యపురుషుడు కాబట్టే భర్త విశ్వరూపం చూడలేకనో యేమో ఇల్లాలు చిన్నప్పుడే పరలోకం చేరింది. ఒంటిగా ఒక్కడు. ఇంత వుడకేసుకుని తినడం, వూరంతా ప్రజా సేవ చేయడం.

ప్రొద్దున కృష్ణలో స్నానం చేస్తూ సోమలింగం దోసెడు నీళ్ళు సూర్యుడికి అర్ఘ్యం ఇచ్చి పక్కకు చూస్తే ముసలయ్య కావిడి ముంచుతూ కని పించాడు. అర్ఘ్యం ఆపి-

"ఏం ముసలయ్యా! బాడవపక్క చేను కొన్నావంటగా" అన్నాడు.

"అయ్యా" అన్నాడు ముసలయ్య.

"నీళ్ళు ముంచుకోవడం తరువాత. ఆ పొలం కొని మవు మునిగావేమో చూసు కున్నావా?" అన్నాడు సోమలింగం.

కావిడొదిలేసి రెండు చేతులూ జోడించాడు ముసలయ్య.

"కంగారులేదు. కాగితాలు పట్రా చూస్తాను" అంటూ సూర్యుడికి అర్ఘ్యం ఇచ్చాడు సోమలింగం.

పరుగు పరుగున కాగితాలు తెచ్చాడు ముసలయ్య.

సోమలింగం చదివి కాసేపు జుత్తు పీక్కుని, మరి కాసేపు మదురు బాదుకుని, "ఈ పొలం అమ్మే హక్కు సుబ్బయ్యకు లేదయ్యా" అన్నాడు.

ముసలయ్యకు కడుపు మండింది.

"డబ్బిచ్చి కొనుక్కుని రిజిస్ట్రీ చేయించు కుంటే, చెల్లదంటా రేటండీ" అని అరిచాడు.

"ఆ అరుపులూ కేకలూ ఎందుకయ్యా? నీ కాగితాలు చెల్లుతాయో, నా మాట చెల్లుతుందో చూద్దాంగా" అన్నాడు సోమలింగం.

"మీరు చేసేదేందో చేసుకోండి" అని విసు రుగా వెళ్ళిపోయాడు ముసలయ్య. వెళ్ళిన మరు క్షణం వేలు విడిచిన మేనమావ కొడుకు ఎవడో భద్రయ్యనేవాడికి కబురెళ్ళనే వెళ్ళింది. "పదెక రాల పొలం పాయసంలా జుర్రుకో. వెయ్యి దావా" అన్నాడు సోమలింగం. వ్యాజ్యం ఆరేళ్ళ పాటు సాగింది.

ముసలయ్య పొలమైతే దక్కించుకున్నాడు గానీ, కొన్న ఖరీదుకు మూడింతలు కోర్టుకు ధారపోశాడు.

ఓ రోజు సోమలింగం బజారున వెళు తూంటే పుల్లయ్య ఇంటి వాకిటికి తోరణాలు కనిపించాయి. సోమలింగానికి పచ్చటి ఆకు అన్నా, పసుపు తాళ్ళన్నా గొప్ప చిరాకు. పదడు గులు బజార్లోకేసి భూమయ్యని పిలిచి చెట్టు క్రింద కూర్చోబెట్టి ఈ విధాన బోధ చేశాడు. "నీకు పుల్లయ్య అప్పున్న మాట నిజమే. మన వాడూ కావల్సినవాడూ, ఆదుకుందామన్న ఉద్దే శ్యంతో అప్పిచ్చావు సంతోషమే. అడిగినప్పుడల్లా పుల్లయ్య తిరిగి ఇవ్వకుండా వాయిదా వేస్తు న్నాడు. నీ నిదానం మెచ్చుకోదగినదే. నువ్వు ఉత్తముడివి. కానీ ఆ అప్పు ఈ జన్మలో తిరిగి రాదని తెలిస్తే నువ్వేమైపోతావు? పెళ్ళి కావల్సిన ఆడపిల్లుంది. పైకి రావల్సిన పసివాళ్ళున్నారు. వాళ్ళ గతేమిటి?"

భూమయ్య బేలగా అడిగాడు "అయితే నా డబ్బు నీళ్ళపాలేనా?"

"పాలు లేవు నీళ్ళే! వెళ్ళి చూడు వ్రతాలు చేస్తున్నాడు. మొన్న ఒక వ్రతం. ఇవ్వాళో వ్రతం. వీటికి డబ్బులెక్కడివి? నేను చెప్తు న్నాను నమ్ము. నీ బాకీ తీర్చడానికి డబ్బు లేక కాదు, నీకు మొండి చెయ్యే."

భూమయ్యకు భయం వేసింది. ఆ భయం లోంచి కోపం పొంగింది. బారలు బారలుగా నడుస్తూ పుల్లయ్య ఇంటికొచ్చి గొంతుమీద కూర్చుని బాకీ తీర్చమన్నాడు. పుల్లయ్య డబ్బు లేదని మొత్తుకుంటే నగా నట్రా తాకట్టు పెట్టించుకుని వెళ్ళిపోయాడు. సోమలింగం బజారునుంచి తిరిగొస్తుంటే పుల్లయ్య ఇంటి వాకిటి తోరణాలు తెగి వున్నాయి. తృప్తిగా నవ్వు కుని కుక్కిమంచంలో హాయిగా నిద్రపోయాడు.

ఎవరైనా ఇల్లాలు మెడనిండా నగలతో కని పిస్తే సోమలింగానికి కంపరమెత్తేది. ఎవడైనా నవ్వుతూ కనిపిస్తే వెన్నులో పోటొచ్చేది. సోమ లింగం చూపుకి వూరంతా భయపడేది. ఎవర్నై యినా పై నుంచి కిందికి ఎగాదిగా చూశాడో వాటికి మూడినట్టే.

ఒక్క ముసలి బుచ్చమ్మే సోమలింగానికి ఎదురుగా వెళ్ళగలదు. నాలుగూ పెట్టగలదు. బుచ్చమ్మ కర్రపోటుతో వస్తుంటే సోమలింగమే పక్కకు తప్పుకునేవాడు. పోయేవాడ్ని పిలిచి మరీ తిట్టేది బుచ్చమ్మ.

"దిష్టిముండాకొడకా! పదిమంది ఉసురు పోసుకుంటున్నావు గదరా! పట్టెడన్నం ఏనాడైనా ఎవరికైనా పెట్టావా? కొంపలు కూల్చే నీకు కునుకెట్టాపడుతుందిరా?" సోమలింగం వుల కదు, పలకదు. తలొంచుకుని సందుల్లోకి తప్పు కుంటాడు. అతనికి బుచ్చమ్మ చూపులు సూదుల్లా, మాటలు శూలాల్లా గుచ్చు కుంటాయి.

ఉన్నట్టుండి సోమలింగం మంచాన పడ్డాడు. తనకి అవసానదశ సమీపించిందని తెలుసు కున్నాడు. వూరందర్నీ చిన్నా, పెద్దా పిలి పించాడు. అందరికీ చేతులెత్తి దణ్ణం పెట్టి అన్నాడు. "నేను పాపాత్ముణ్ణి. మీ కందరికీ అపకారం చేశాను. క్షమించగలిగితే క్షమించండి. నా చివరి కోరిక ఒక్కటి తీర్చండి. నన్ను దహనం చేయకండి. అంత పుణ్యానికి నేను తగను. నేను పాపిని. నన్ను గోరీల దొడ్లో పాతిపెట్టండి. నన్ను భూస్థాపితం చేస్తేనే నాకు శాంతి." అదేమి కోరిక అన్నారంతా. పాతి పెట్టిస్తామని అందరిదగ్గరా వాగ్దానం చేయించు కుని ఆఖరి శ్వాస విడిచాడు సోమలింగం.

మాట ప్రకారం సోమలింగాన్ని గోరీల దొడ్డికి మోసుకెళ్ళారు. సాయెబులు హిందువుని గోరీలదొడ్లో పాతిపెడ్తే వూరుకుంటారా? వీల్లే దని తిరగబడ్డారు. వూరు తిరగబడింది. కర్రలు లేచాయి. దొమ్మీ జరిగింది. ఆ హోరాహోరీలో బుచ్చమ్మ కర్రపోటుతో "ఆగండ్రోయ్?" అని అరిచింది. ఆగారు.

"ఇంత మందున్నారు బుద్ధిలేక పోయెనే! వాడు చచ్చింతర్వాత కూడా మీకు మాకూ పోట్లాట పెట్టడానికి తన్ని పాతిపెట్ట మన్నాడ్రా?" అంది. అందరికీ తెలివొచ్చింది.

హిందువులు, ముస్లింలు ఏకంగా సోమలిం గాన్ని కృష్ణొడ్డుకు మోసుకెళ్ళి బూడిదచేశారు.

ముత్యాలవాన